సాక్షి తిరుపతి

శనివారం । 9 । డిసెంబర్ । 2023



రూ.41 లక్షల ఆదాయం

సూళ్లూరుపేట చెంగాళమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.41 లక్షల మేర వచ్చినట్టు అధికారులు తెలిపారు. - 8లో



కర్పూరజ్యోతి పూజోత్సవం

నాయుడుపేట పట్టణంలో అయ్యప్ప స్వామి అఖండ కర్పూర జ్యోతి పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. - 8లో



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

చిత్తూరు–పలమనేరు జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. - 8లో

న్యూస్‌రీల్

తేజోమయం



కార్తీక దీపానికి పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాదీపాన్ని తేజోమయంగా వెలిగించారు. మొదట ఆలయంలోని ఊంజల్‌సేవా మండపం వద్ద ఏర్పాటు తేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 56,344 మంది స్వామివారిని దర్శించుకోగా 17,616 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.26 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తప్పు చేస్తే చర్యలు తప్పవు



ప్రయివేటు ఆస్పత్రిలోని స్కానింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి

గూడూరు రూరల్: ప్రవేటు ఆస్పత్రుల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి శ్రీహరి హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రయివేటు వైద్యశాలలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కొంమంది ఇంకా పాత జిల్లా పేరుతోనే ఆఫ్‌లైన్‌లో రికార్డులు నడుపుతున్నట్లు గుర్తించారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని ఆస్పత్రులు తిరుపతి జిల్లాలోని వైద్యాధికారి పరిధిలో ఉంటాయన్నారు. ఆయా ఆస్పత్రుల యాజమాన్యలు ఇది గుర్తించుకోవాలని సూచించారు. గూడూరులోని పలు ప్రయివేటు ఆస్పత్రులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీ చేసినట్టు వెల్లడించారు. ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా నోడల్ అధికారి డాక్టర్ తేజస్విని, జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

నేడు చాగంటి శిష్య బృందం కైలాస గిరిప్రదక్షిణ

శ్రీకాళహస్తి: ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శిష్యబృందం, శ్రీగురువాణి సొసైటీ సభ్యులు శనివారం శ్రీకాళహస్తిలో కైలాస గిరిప్రదక్షిణ చేయనున్నట్లు శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం అధికారులు తెలిపారు. సుమారు 200 మంది గిరిప్రదక్షిణ చేయనున్నారని, పట్టణ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

తిరుపతి లీగల్: తిరుపతి కోర్ట్ ఆవరణలో శనివారం ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ గురునాథ్ శుక్రవారం తెలిపారు. ఇందులో కేసుల పరిష్కారం కోసం ఎనిమిది బెంచ్‌లను ఏర్పాటు చేసినట్టు న్యాయమూర్తి వెల్లడించారు. కోర్టులో ఉన్న సివిల్, రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, ఇతర కేసులను పరిష్కరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తం



ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రవిరాజు

చిత్తూరు రూరల్: ఇటీవల కురిసిన వర్షాలతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రజలను అప్రమత్తం చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రవిరాజు ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. చికెన్‌గున్యా, డెంగీ వ్యాప్తి చెందే ప్రమాదముందని హెచ్చరించారు. వైద్యుల సిఫార్సు మేరకే మందులు వాడాలని సూచించారు. ఆ మేరకే ల్యాబ్‌ల్లో సైతం రక్తపరీక్షలు చేయాలని, అనధికారింగా టెస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

'జగనన్నా..! చేతికొచ్చిన పంట కొట్టుకుపోయింది. నోటికాడ కూడు తీసేసినట్టయ్యింది. రొయ్యల సాగు ఎందుకూ పనికిరాకుండా పోయింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిగులు పట్టుకుంది. ఎక్కడి నుంచి వచ్చిందో ఆ మాయదారి వరద.. మా ఆశలన్నీ ముంచేసింది. ఇళ్లను కూడా పెకలించి కూల్చేసింది. గ్రామాలకు గ్రామాలనే ముంచేసింది. గొడ్డూగోదా ఉసురు తీసింది' అంటూ వరద బాధితులు చెబుతున్న మాటలు విని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. అన్నదాతల ఆక్రందనలు విని ఆవేదనకు లోనయ్యారు. 'అధైర్యపడొద్దు.. అండగా ఉంటా'నంటూ భరోసానిచ్చారు. అన్ని విధాలా ఆదుకుంటానని ధైర్యం చెప్పారు.

వరద బాధితులకు సీఎం జగన్ కొండత ఓదార్పు

- అధైర్యపడొద్దు.. అండగా ఉంటానని భరోసా
- బాధితుల కష్టాలు విని చలించిపోయిన ముఖ్యమంత్రి
- రూ.30 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- అన్నదాతకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు



బాలిరెడ్డిపాళెంలో తెగిపోయిన స్వర్ణముఖి కరకట్టను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ..!





ముఖాముఖిలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి(ఇన్‌సెట్) హాజరైన వరద బాధితులు

సాక్షి, తిరుపతి: తుపాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం గూడూరు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా ఆయన ఏరియల్ సర్వే చేశారు. ఆపై క్షేత్ర స్థాయిలో పర్యటించి వరద నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. బాధితుల కష్టాలు విని చలించిపోయారు. అన్నదాతల కన్నీళ్లు తుడుస్తూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. వాకాడు మండలంలోని తొమ్మిది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడకుండా స్వర్ణముఖి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వరదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంటలు తిరిగి వేసుకునేందుకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సీఎం ప్రకటనపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెం పరిధిలో కోతకు గురైన స్వర్ణముఖి నది లోలెవల్ కాజ్‌వే, వరి పంటలను పరిశీలించి ఆవేదనకు లోనయ్యారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే వరప్రసాద్, జిల్లా పార్టీ అధ్యక్షులు నేదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వాకాడు మాజీ ఏఎంసీ చైర్మన్ కొడవలూరు దామోదర్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బారులుదీరిన అభిమానం

ముఖ్యమంత్రి వస్తున్నారని తెలుసుకున్న స్థానికులు విద్యానగర్ నుంచి బాలిరెడ్డిపాళెం వరకు బారులు తీరారు. తమ రాకకోసం నిరీక్షిస్తున్నారని గుర్తించిన ముఖ్యమంత్రి వారిని ఆప్యాయంగా పలకరించారు. రైతుల ఆవేదనను స్వయంగా విని చలించిపోయారు. వృద్ధురాలి కన్నీటిని తుడుస్తూ.. 'ఏడ్వకవ్వా.. నేనున్నాను' అంటూ భరోసానిచ్చారు. మానవత్వంతో స్పందించిన తీరుని చూసి వృద్ధురాలు సీఎం ముఖాన్ని పట్టుకుని 'నువ్వు చల్లంగా ఉండాలి నాయనా' అంటూ దీవెనలందించారు. అక్కడే ఉన్న స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. 'జగన్ మామయ్యా.. జగన్ మామయ్యా' అంటూ దీనంగా తనవంక చూసి అరుస్తున్న చిన్నారుల వద్దకు వెళ్లి బుగ్గలు నిమిరారు. 'బాగా చదువుకో' అంటూ ముందుకు కదిలారు. ముఖాముఖి సమావేశంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తీసుకుని వాటి పరిష్కరించాలని కలెక్టర్‌ని ఆదేశించారు. సాధారణ పరిస్థితులు నెలకొనేవరకూ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసానిచ్చారు. శరవేగంగా సాగుతున్న సహాయక చర్యలపై సీఎం నేరుగా ప్రజలతో మాట్లాడి వారి నుంచి వివరాలు తీసుకున్నారు. బాధిత కుటుంబాలకు అందించే నిత్యావసర సరుకుల పంపిణీపైనా ఆరా తీశారు. విద్యుత్, రహదారులు, తాగునీటి సౌకర్యం పునరుద్ధరణ, పంట నష్టం అంచనాకు సంబంధించి ఎన్యూమరేషన్ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగిన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆదిమూలం, కిలివేటి సంజీవయ్య తమ నియోజకవర్గాల్లో జరిగిన నష్టాలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు.

సీఎంకు ఘన స్వాగతం

కోట: వాకాడు మండలం, బాలిరెడ్డిపాళెం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కోట మండలం, విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్ వద్ద నాయకులు ఘన స్వాగతం పలికారు. సీఎం వెంట ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి తానేటి వనిత ఉన్నారు. కాగా హెలీప్యాడ్ వద్ద మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, గూడూరు, సూళ్లూరుపేట, ఆత్మకూరు ఎమ్మెల్యేలు వరప్రసాద్‌రావు, సంజీవయ్య, మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, బల్లి కల్యాణ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



చల్లంగుండు మనవడా..



నేనున్నానని : దివ్యాంగుడి కష్టాలు వింటూ..



మూడెకరాలు నీటి పాలు : గోడు వెళ్లబోసుకుంటున్న రైతు



ఫొటో ఎగ్జిబిషన్ చూస్తున్న సీఎం వైఎస్ జగన్



కలిసొచ్చిన ఈ కాలం.. వరమిచ్చిన ఉల్లాసం: మనవడిని చూసిన ఆనందంలో..



ఏమైంది తల్లీ: బాధితురాలి కష్టాలు వింటున్న సీఎం జగన్

నవీన తిరుపతిని నిర్మిస్తున్నాం

- జగనే ఎందుకు కావాలి సభల్లో ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి వెల్లడి



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి సిటీ: గత పాలకులకంటే భిన్నంగా సీఎం జగనన్న సహకారంతో కొత్త తిరుపతిని నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి నగరంలోని 8, 19, 31, 46 డివిజన్ల సచివాలయాల పరిధిలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూటమికి ఓటేసి గెలిపిస్తే రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నాలుగున్నరేళ్లలో తిరుపతిలోని 2 లక్షల 10 వేల మందికి వివిధ పథకాల కింద 1,700 కోట్ల రూపాయలు అందించినట్టు వెల్లడించారు. జగనన్న ఓట్ల కోసం సంక్షేమ పథకాలు అందించే వ్యక్తి కాదన్నారు. 26 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చామని, మిగిలిన వారికి కూడా ఇస్తామన్నారు. అలాగే 5,500 కుటుంబాలు 60 ఏళ్లుగా ఎదుర్కొంటున్న 22ఏ సమస్యను పరిష్కరించి వారికి ఇంటి స్థలాల మీద చట్టపరమైన హక్కులు కల్పించినట్టు తెలిపారు. టీటీడీలో పనిచేస్తున్న 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులకు రూ.5 వేల జీతం పెంచామన్నారు. తిరుపతి నగరంలో 18 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించినట్టు పేర్కొన్నారు. గంగ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటింపజేసి ఘనంగా నిర్వహించామన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి పది రోజుల పాటు జరిగే తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుపతిలో వివిధ ప్రాంతాల్లో కౌంటర్లు పెట్టి లక్షన్నర మంది స్థానికులకు దర్శనం చేయించే ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగడానికి జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కరుణాకర రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మునిరామిరెడ్డి, సంధ్య, రేవతి, పార్టీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, మురళీరెడ్డి, బాలిశెట్టి కిషోర్, దేవదానం పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెండి అభిషేక శంఖం వితరణ



వెండి అభిషేక శంఖాన్ని ఆలయ అధికారులకు అందజేస్తున్న దాత అంజలీదేవి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీశ్రీనివాస ఆలయానికి దాతలు వెండి అభిషేక శంఖాన్ని విరాళంగా అందజేశారు. తిరుచానూరుకు చెందిన అంజలీదేవి 663 గ్రాముల బరువు గల వెండి అభిషేక శంఖాన్ని ఆలయ అధికారి నాగేంద్రబాబుకు అందజేశారు. దాతలు అందించిన వెండి శంఖం విలువ సుమారు రూ.72 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు.

13న డీ ఫార్మసీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల కాలవ్యవధి గల డీ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కోర్సుకు రెగ్యులర్ బైపీసీ, ఎంపీసీ ఉత్తీర్ణులైన వారు, సింగిల్ సిట్టింగ్ పద్ధతిలో ఉత్తీర్ణులైన వారు, ఓపెన్ స్కూల్స్ ద్వారా 10+2 ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 13వ తేదీన ఉదయం 10గంటలకు పది, ఇంటర్ మార్కుల జాబితా, నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఫొటోలతో పాటు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.6,300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.5,700 ఫీజుతో హాజరవ్వాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 99635 41557, 99667 61446, 99088 57585 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.



సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మంత్రి ఆర్‌కే రోజా, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి



సీఎంతో పాటు ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి , స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

సీఎం జగన్‌కు సాదర స్వాగతం

రేణిగుంట: తిరుపతి జిల్లాలో మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సాదర స్వాగతం లభించింది. ఆయన శుక్రవారం ఉదయం 10.18 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోగా, విమానాశ్రయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీఐజీ అమ్మిరెడ్డి, తిరుపతి నగర కమిషనర్ హరిత, నగర మేయర్ శిరీష,శ్రీకాళహస్తి ఆర్‌డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన 10.30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటన నిమిత్తం వాకాడుకు వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఉన్నారు.

వందేభారత్‌లో మంత్రి రోజా ప్రయాణం



ప్రయాణికులతో మంత్రి ఆర్కే రోజా

తిరుపతి(అలిపిరి): తిరుపతి నుంచి గుంటూరు వరకు వందేభారత్ రైలులో శుక్రవారం సాయంత్రం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా ప్రయాణం చేశారు. ట్రైన్‌లోని ప్రయాణికులతో రోజా ముచ్చటించారు. ప్రయాణికులు మంత్రితో సెల్ఫీలు దిగుతూ ఉల్లాసంగా గడిపారు.

పార్టీ అభివృద్ధే లక్ష్యం

పెళ్లకూరు: పార్టీ అభివృద్ధే లక్ష్యంగా అన్ని ప్రాంతాల్లోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసికట్టుగా పనిచేయాలని డెప్యూటీ సీఎం కే.నారాయణస్వామి అన్నారు. శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాలకు వచ్చిన సీఎం జగన్‌ను కలిసిన ఆయన అనంతరం తిరుపతికి వెళుతూ మార్గమధ్యంలో చిల్లకూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి నివాసానికి చేరుకున్నారు. అక్కడ స్థానిక శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్యతో కలిసి పార్టీ విషయాలపై చర్చించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నాయకులతో కలిసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు, జగన్ మార్క్‌తోనే



ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి నివాసంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే సంజీవయ్య

వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయం సాధించాలన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

గూడూరు రూరల్: మండలంలోని దివిపాళెంలో ఓ యువకుడు విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని బేల్దారి కాలనీకి చెందిన శివకుమార్(17) కొంత మందితో కలసి దివిపాళెం సమీపంలోని అటవీ ప్రాంతంలో కట్టెలు కొట్టేందుకు వెళ్లాడు. నల్లకాలువ సమీపంలో 11 కేవీ విద్యుత్ తీగ తెగి నీటిలో పడి ఉండడాన్ని గుర్తించకుండా కాలువలోకి దిగడంతో విద్యుత్ షాక్‌కు గుయ్యాడు. దీంతో అతడిని సహచరులు గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం

ఏర్పేడు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని రాజులపాలెంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందు జెండా ఆవిష్కరణ చేసి వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరాలు తెలిపే డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధిపొందినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. మరింత అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, కో–ఆప్షన్



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, నాయకులు తోకల రవిచంద్ర, పరమాల చంద్రశేఖర్, దామోదరంరెడ్డి, రమేష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

12 నుంచి ఫ్రిడ్జ్, ఏసీల మరమ్మతులపై శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాల పురుషులకు ఉచిత ఉపాధి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 తేదీ నుంచి 30 రోజుల పాటు రిఫ్రిజిరేటర్, ఏసీ మరమ్మతులు, సర్వీసింగ్‌పై శిక్షణ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన, 19- 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, కనీసం 10వ తరగతి చదువుకున్న నిరుద్యోగ పురుషులు అర్హులని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను–పోను ఒక్కసారి బస్సు చార్జీ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో నేరుగా సంస్థ వద్దకు వచ్చి, పేర్లను నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఒక్క బ్యాచ్‌కు 25 నుంచి 30 మందిని మాత్రమే చేర్చుకుంటామని, ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకా నగర్, కొత్తపేట, చంద్రగిరి, 79896 80587, 94949 51289 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.41 లక్షలు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం హుండీలను లెక్కించారు. 82 రోజులకు రూ.41 లక్షల ఆదాయం వచ్చిందని ఇన్‌చార్జి ఈఓ వెంకట శ్రీనివాసులు తెలిపారు. సాధారణంగా 90 రోజులకు హుండీలను లెక్కిస్తుంటారు. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కాళంగినది పొంగడంతో ఆలయంలోకి వరద వచ్చి, హుండీల్లోకి నీరు పోవడంతో నగదు తడిసిపోయింది. దీంతో ఇన్‌చార్జి ఈఓ వెంకట శ్రీనివాసులు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సీ హెచ్ శ్రీనివాసబాబుకు విషయం తెలియజేసి, ఆయన సమక్షంలోనే హుండీలను తెరిచారు. అందులో ఉన్న నగదు తడిసిపోవడంతో కరెన్సీ నోట్లను ఆలయం వెలుపల ఆరబెట్టారు. అనంతరం లెక్కించగా రూ.41,06,932 నగదు, యూ ఎస్‌ఏ డాలర్లు 124, యూఏఈ దిరమ్స్ 75, నేపాల్ కరెన్సీ రూ.10 ఆదాయం వచ్చింది. పాలకమండలి సభ్యులు ఎం చంద్రశేఖర్‌రెడ్డి, వీ దినేష్‌కుమార్, ఎం అమరావతి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

తిరుపతి లీగల్: ఆర్టీసీ బస్సును నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపి ఓ మహిళ మృతికి కారకుడైన కేసులో తిరుపతి బొమ్మగుంట ఎస్బీ కాలనీకి చెందిన అలిపిరి డిపో ఆర్టీసీ బస్సు డ్రైవర్ వీ.గురప్పకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ఆరవ అదనపు జూనియర్ జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ అయ్యప్ప తెలిపిన వివరాల మేరకు.. 2017 డిసెంబర్ 14న తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలోని విష్ణు నివాసం వద్ద డ్రైవర్ గురప్ప ఆర్టీసీ బస్సును నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపి రోడ్డుపై వెళ్తున్న కే.గౌరమ్మను ఢీకొట్టాడు. బస్సు ముందు ఉన్న చక్రం ఆమె నడుముపై వెళ్లడంతో మృత్యువాత పడింది. ఆమె కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి బస్సు డ్రైవర్‌ను కోర్టులో హాజరుపరిచారు. నేరం డ్రైవర్ గురప్పపై రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

అత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి అత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరికి 15 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. తిరుపతి రాజీవ్‌నగర్ కాలనీ, క్రాంతి నగర్‌కు చెందిన నారాయణప్ప ఆర్య, బీ హర్షవర్ధన్‌ను బాధితుడి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

తల్లీబిడ్డ అదృశ్యంపై ఫిర్యాదు

చిత్తూరు అర్బన్: నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన హేమలత (21) అనే వివాహిత తన కూతు రితో సహా కనిపించకపోవడంపై భర్త విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే విజయ్‌కుమార్ భార్య తన రెండేళ్ల కుమార్తెను తీసుకుని గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెదికినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త పోలీసులను ఆశ్రయించాడు. టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీర గ్రామాలకు తాత్కాలిక మార్గం ఏర్పాటు

దొరవారిసత్రం: మండలంలోని తీరప్రాంత గ్రామాలైన మీజూరు, కారికాడు, వేలికాడు గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గానికి గండి పడడంతో తాత్కాలిక మార్గం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చొరవతో యుద్ధప్రాతిపదిక సంబంధిత అధికారులు గండి పడిన ప్రాంతంలో సవక కర్రలతో శుక్రవారం తాత్కాలిక మార్గం ఏర్పాటు చేశారు. దీంతో తీర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగుతున్నాయి. తీర ప్రాంతాల్లో ప్రజల పరిస్థితి తెలుసుకునేందుకు మండల కన్వీనర్ ఈ శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఏఓ జ్యోతిర్మయి తదితరులు ఈ మార్గం మీదుగా వెళ్లి తీర గ్రామాల్లోని ప్రజలకు పరామర్శించి యోగక్షేమాల తెలుసుకున్నారు.



మీజూరు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్గం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

పూతలపట్టు : చిత్తూరు–పలమనేరు రహదారిలో గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. పాకాల మండ లం కుక్కలపల్లెకు చెందిన గజపతి కుమారుడు సాయికుమార్(23), సూరినేనివారిపల్లెకు చెందిన మురళీ కుమారుడు అభిలాష్ (20), గుండ్లపల్లెకు చెందిన మాబూషరీఫ్ కుమారుడు బావాజాన్(25) అమరరాజా గ్రోత్ కారిడార్‌లో పనిచేస్తున్నారు. ముగ్గురూ గురువారం రాత్రి 10 గంటలకు విధులు ముగించుకుని కంపెనీ నుంచి బైక్‌పై ఇళ్లకు బయలుదేరారు. మార్గం మధ్యలో తేనేపల్లె లేఅవుట్ వద్ద కడప నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ఐషర్ వాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయికుమార్, అభిలాష్ అక్కడిక్కడే మృతి చెందగా, బావాజాన్‌కు తీవ్రమైన గాయలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీకి తీసుకువెళ్లారు. యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్‌భూపాల్ తెలిపారు.

ఘనంగా అఖండ కర్పూరజ్యోతి పూజోత్సవం



అయ్యప్పస్వామి పూజలో ఎమ్మెల్యే సంజీవయ్య,ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



అయ్యప్పస్వామి నగరోత్సవంలో ప్రమిదలతో మహిళా భక్తులు

నాయుడుపేటటౌన్: పట్టణంలో అయ్యప్పస్వామి అఖండ కర్పూర జ్యోతి పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీ పార్కు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన 42వ అఖండ జ్యోతి పూజోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అయ్యప్పస్వామిని దర్శించుకుని తన్మయత్వం పొందారు. శుక్రవారం ఉదయం నుంచే వేదపండితులు గణపతి హోమం భక్తి శ్రద్ధలతో చేశారు. అనంతరం కలశ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పంచవాయిద్యాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. గజేంద్రస్వామితోపాటు గురుస్వాములు అయ్యప్ప అంబళం ఏర్పాటు చేసి, మెట్టు మెట్టుకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తూ 18 మెట్ల వద్ద కర్పూరం వెలిగించారు. తరువాత తారకప్రభు భక్త బృంద గురుస్వాములు సేకరించిన 200 కిలోల కర్పూరం వెలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ జె వెంకటకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కే రాజారెడ్డి, జీ సిద్దయ్య, సీహెచ్ కుమార్, రవి, కే అశోక్ కుమార్, పీ చంద్రారెడ్డి, సిమెంట్ సురేష్, ఎన్‌సీఆర్ తదితరులు అఖండ జ్యోతి వెలిగించారు. రాత్రి దేవతామూర్తుల వేషధారణలు, నృత్యాలు, కేరళ వాయిద్యాలు, తప్పెటగుళ్ల నడుమ అయ్యప్పస్వామి నగరోత్సవం వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమాల్లో సీఐ నరసింహారావు, కమిషనర్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, భగవాన్, అయ్యప్ప సేవా సంఘం నాయకులు కే సుబ్రమణి, ఈహెచ్ మునిరాజ, ఎం జలందర్, జీ గోపి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అఖండ కర్పూర జ్యోతి కాంతులు